క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు వేకువజాము నుంచే వివిధ రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం పలుగ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారని తెలియ జేశారు.

క్షయ రోగులకు అధిక పోషక సరుకుల పంపిణీ



పీహెచ్‌సీలో రోగులకు సరుకులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

బలిజిపేట: క్షయ వ్యాధిగ్రస్తులకు అధిక పోషకాల సరుకులను బలిజిపేట పీహెచ్‌సీలో గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అరబిందో ఫార్మసీ సంస్థ, హైదరాబాద్ వారు సరఫరా చేసిన అధిక పోషకాల సరుకులను వైద్యాధికారిణి కిరణ్మయి పంపిణీ చేశారు. ఆయిల్‌ప్యాకెట్, ఖర్జూరం, కందిపప్పు, బెల్లం, శనగపలుకులు, రాగిపిండి, బూస్ట్ సరఫరా చేశారు. 6నెలల పాటు క్షయ వ్యాధిగ్రస్తులకు వాటిని పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. క్షయవ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉంటే వారందరికి పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి, పీహెచ్‌ఎన్ చంద్రావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సగటు వేతనం రూ.257 పొందేలా పనిచేయాలి



వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం నిర్దేశించిన సగటు వేతనం గిట్టుబాటయ్యే విధంగా వేతనదారులు పని చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుచ్చిమి గ్రామంలో శెట్టివాని బందలో వేతన దారులు చేస్తున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.257కు గాను ముందస్తు కొలతలతో పని చేయించాలని సూచించారు. వేతనదారులు సమయ పాలన, ముందస్తు కొలతలు వేసుకుని పనులు చేస్తే నిర్దేశించిన వేతనం గిట్టుబాటవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో తరుగుదల

వీరఘట్టం: ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుండి రేషన్ డిపోలకు వస్తున్న బియ్యం బస్తాలు తూకంలో తక్కువగా ఉంటున్నాయని మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఒక్కో బియ్యం బస్తా 50.6 కిలోల బరువు ఉండాలని, మాకు వస్తున్న బియ్యం బస్తాలు 43 నుండి 45 కిలోలు వస్తున్నాయని తెలిపారు. డిపోలకు బస్తాలు వచ్చేటప్పుడు తూకం వేసి ఇమ్మంటే ఇవ్వకపోవడంతో ఆ మిగులు భారం డీలర్లపై పడుతుండడంతో తాము ఆర్థికంగా సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు స్పందిస్తూ ఇకపై అటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంగ్ల టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు అధికారి బి.నవ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన ఈ నియామకం ఉంటుందన్నారు. గెస్టు టీచర్‌గా పని చేయడానికి మహిళా అభ్యర్థి అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోగా పాతపట్నం వైటీసీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మేలు చేసిన ప్రభుత్వానికి అండగా ఉండండి

- ఎమ్మెల్యే జోగారావు



పలగరలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

పార్టీలకు అతీతంగా, నిరుపేదలైన అక్కాచెల్లెమ్మలు, వృద్ధులు, యువకుల జీవనోపాధికి, రైతులు, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించి రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. బలిజిపేట మండలం పలగరలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడగడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి వారు అందుకున్న సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు తెలియజేసి వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందిస్తోందన్నారు. నవరత్నాల్లాంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలోని అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నది జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమే అన్నారు. ఎటువంటి మధ్యవర్తిత్వం, దళారీతనం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు నేరుగా ఖాతాలలో నగదు జమచేసి వారి సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయా? లేదా? అని పర్యవేక్షించి ఎటువంటి లోపాలు ఉన్నా వాటిని సవరించాలనే సంకల్పంతో ఎమ్మెల్యేలను గడపగడప ఎక్కించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని అమలు చేస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్న ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డిదేనన్నా రు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎస్.భాస్కరరావు, కె.సత్యంనాయుడు, జాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లాల్లోని ధాన్యం కొనుగోలుకు చర్యలు



చినభోగిలి కళ్లాల్లో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్‌డీఓ మూర్తి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు వరిచేను నూర్పిడిచేసిన కళ్లాల్లో ఉంచిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన ఏఓ ఎస్.అవినాష్‌తో కలిసి కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో చినభోగిలి, బూర్జ గ్రామాల్లో ధాన్యం నిల్వలను చూసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వులమేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించి, ధాన్యం విక్రయాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. గురువారం చినభోగిలి, పెదభోగిలి, కెవెంకటాపురం, బూర్జ, కృష్ణారాయపురం, లక్ష్మీపురం గ్రామాల రైతుల కళ్లాల్లోని ధాన్యం నిల్వలను గుర్తించినట్లు తెలియజేశారు. రైతుల వద్ద ఉన్నధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ధాన్యం నిల్వలను గుర్తించిన నివేదికను కలెక్టర్‌కు పంపించిన తరువాత ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలవుతుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులనుంచి ధాన్యం సేకరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర వస్తుందని, అంతవరకూ మధ్యవర్తుల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది జగన్నాథ రావు



కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్/కొమరాడ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, కేఆర్‌బీపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సరిగ్గా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఆరోగ్య కేంద్రం వద్ద రక్త పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని, రక్తహీనత ఉన్న గర్భిణులకు ఇచ్చే మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని హితవు పలికారు. మూడు అంతకంటే ఎక్కువ ప్రసవాలు జరిగిన మహిళలు గర్భ నిరోధక ఆపరేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం మహాభాగ్యమని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమని అన్నారు. ఇంటి ఇల్లాలు ఆరోగ్యం బాగుంటే కుటుంబ ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎస్సీ కాలనీ వాసుల కోరిక మేరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించారని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు జెడ్పీటీసీ ఎం బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ ఎ.సింహాచలం ఎస్సీకాలనీల్లో పవర్‌డ్రిల్‌తో బోరుతీయించే పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు లచ్చయ్యపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఎస్సీ కాలనీ మహిళలు తాగునీరు సౌకర్యం కల్పించాలని, కాలువలు మంజురుచేయాలని కోరారన్నారు. ఈ మేరకు కాలువలపనులు జరుగుతున్నాయని, బోరు తీయించారని, ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణం జరుగుతోందని తెలియజేశారు. గ్రామంలో మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చిన జగనన్న ప్రభుత్వానికి,అమలు చేసిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు గ్రామస్తుల మంతా రుణపడి ఉంటామని అన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



గోపాలపురంలో ఎస్‌డీజీ సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. పాలకొండ మండలం గోపాలపురం సచివాలయాన్ని గురువారం సందర్శించారు. అక్కడి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరు, పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డీజీ, పీఎంజేఏవై సర్వే తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఎస్‌డీజీ సర్వేలో భాగంగా ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించాన్నారు. రానున్న వేసవిని అంచనా వేస్తూ నీటి వనరుల పురోగతిని పెంచాలని సూచించారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సీతంపేట: ట్రాన్స్ జెండర్ల సమస్యను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని మెప్మా పీడీ కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో వారితో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వారికి అందేలా చూస్తామన్నారు. ఎటువంటి సమస్యలున్నా గ్రామ సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. స్పందన ద్వారా సమస్యలు తెలియజేస్తే త్వరితగతిన పరిష్కారమౌతుందన్నారు. ప్రస్తుతం రేషన్‌కార్డుల సమస్య ఉన్నందున రెవెన్యూ అధికారులతో చర్చిస్తామన్నారు. పింఛన్‌లకు కూడా ప్రతిపాదించామన్నారు. వైకేపీ, బ్యాంకుల ద్వారా జీవనోపాదులకు సంబంధించి సహకారం అందిస్తామన్నారు. ఎటువంటి శిక్షణలు కావాలన్నా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కె.సత్యం పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.దేవకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

నేడు వేలంపాట

మక్కువ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం కేసులలో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్సై జి.షైడిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, ఐదు ద్విచక్ర వాహనాలకు ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన వారు ఆధార్‌కార్డుతో సహా పాటలో పాల్గొనాలని కోరారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



షిర్డీసాయి పూజల్లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పాలక మండలి సభ్యులు

పాలకొండ రూరల్: స్థానిక పెద్దకాపు వీధిలో కొలువుదీరిన షిర్డీసాయి మందిర పదవ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. వైభవోపేతమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ క్రమంలో సాయి మందిరంలో విశేష పూజలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హిమరిక మోహనరావు, దుప్పా పాపినాయుడు, నీలాపు శ్రీనివాసరావు, కొంచడ అరుణ్‌కుమార్, కోడెం విజయ్‌కుమార్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ సవర రాము తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌బీకేలతో మెరుగైన సేవలు



కియోస్కో యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ వాహిని

పాలకొండ: రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.వాహిని తెలిపారు. మండలంలోని కొండాపురం ఆర్‌బీకే కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బీకేలను పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కేంద్రాలకు కేటాయించిన పరికరాలను పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. రైతుల నుంచి సేవలపై అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. మరింత మెరుగ్గా సేవలు అందించేలా తమ సిబ్బందికి సూచనలు అందించామన్నారు. ఆమెతో పాటు వీఏఏ సతీష్ ఉన్నారు.

సక్రమంగా భూసర్వే



చిన్నదిమిలిలో గ్రౌండ్ ట్రూథింగ్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

భామిని: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ సర్వే సక్రమంగా ఉండాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. మండలంలో కొనసాగుతున్న వైఎస్సార్ శాశ్వత భూ హక్కు – భూ సర్వే కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావుతో కలిసి చిన్నదిమిలి, నులకజోడు గ్రూప్‌లలో కొనసాగుతున్న భూసర్వే గ్రౌండ్ ట్రూథింగ్‌ను పరిశీలించారు. రైతులకు ఇచ్చిన సమాచార రికార్డులను గుర్తించారు. రైతుల అనుమానాలు నివృత్తి చేసి గుర్తించాలన్నారు. వారి వెంట సర్వేయరు, ఎంఆర్ఐ, వీఆర్‌ఓలు ఉన్నారు.

గర్భిణులకు పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు చేయాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు



అరసాడ పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

బలిజిపేట: గర్భిణులకు పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు తెలిపారు. అరసాడ పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గురువారం గర్భిణులు, వైద్యసిబ్బందితో ఆయన మాట్లాడారు. ఆరోగ్య తనిఖీలు, రక్త పరీక్షల వివరాలను నమోదుచేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణులకు తగు సూచనలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య తనిఖీలను తరచూ చేయించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైద్యాధికారి శశిధర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టిసారించండి



నారాయణపురంలో నాయకులు, వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే జోగారావు నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని నారాయణపురంలో గ్రామస్థాయి నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉండే సమస్యలను గుర్తించి వాటిని తెలియపరచాలని చెప్పారు. గ్రామంలో అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందకపోతే వారి వివరాలు తీసుకుని అందించాలన్నారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల కన్వీనర్ల అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, సన్నిబాబు, ఎం.శ్రీరామూర్తి, ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- విద్యార్థినులకు ప్రిన్సిపాల్ సూచన



విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేయిస్తున్న ప్రిన్సిపాల్ బి.రేణుక

సీతానగరం: విద్యార్థినుల్లో తలెత్తే ఐరన్ లోపాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక హితవు పలికారు. గురువారం స్థానిక ప్రభుత్వజూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామకృష్ణ, టి.రవికుమార్‌ల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమకూర్చిన ఐరన్ మాత్రలను విద్యార్థినులకు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేణుక మాట్లాడుతూ బులురకంటే ఎక్కువగా బాలికలకు తరచూ ఐరన్‌లోపం వస్తుందన్నారు. ఐరన్‌లోపం వలన విద్యార్థినులు చదువుపై ఆశక్తి చూపలేకపోతారని, ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. వాటి నివారణకు ఎప్పటికప్పుడు హెచ్‌బీ పరీక్షలు చేయించుకుని పౌష్టికాహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇళ్లలో ఐరన్‌లోపంతో ఇబ్బందులు పడుతున్న వారికి విద్యార్థినులు అవగాహన కల్పించాలని కోరారు.

వ్యవసాయం, ఉపాధికి నిధులు పెంచాలి



తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పార్వతీపురంటౌన్: వ్యవసాయం, ఉపాధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలకు ఆలిండియా ప్రజా సంఘాలు పిలుపునిచ్చిన సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురం పోస్టాఫీస్ వద్ద గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరంలో ప్రతిపాదించిన బడ్జెట్ పేద ప్రజలు, రైతులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి భారీగా నిధులు తగ్గించారని ఉపాధి పథకానికి గత సంవత్సరం రూ.89 వేల కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం రూ.60 వేల కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. అలాగే పౌరసరఫరాల్లో ఆహార సబ్సిడీకి సుమారు రూ.90 వేల కోట్లు తగ్గించారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిర, సీఐటీయూ జిల్లా ట్రెజరర్ గొర్లి వెంకటరమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కరణం రవీంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాలమెట్ట రాము తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్‌లపై చర్యలు

గరుగుబిల్లి: అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ జి.పైడితల్లి హెచ్చరించారు. గొట్టివలస రెవెన్యూ పరిధిలో లేఅవుట్‌కు సంబంధించి అనుమతులు లేకుండా విక్రయాలకు బ్యానర్ ఏర్పాటు చేయగా దాన్ని గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేఅవుట్ అనుమతులు తప్పనిసరన్నారు. కొనుగోలుదారులు తప్పనిసరిగా పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అన్ని అనుమతులు ఉన్నాయా.. లేదా... తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ భూములను లే అవుట్లుగా మార్చాలనుకుంటే తప్పనిసరిగా కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దానిని పరిశీలించి అనుమతించిన తరువాతే లేఅవుట్లు వేయాల్సి ఉందన్నారు. కానీ చాలా మంది లేఅవుట్ల యజమానులు అలాంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. ఇటువంటి భూముల్లో లేఅవుట్లు వేసినా చెల్లుబాటు కావని, దీన్ని కొనుగోలుదారులు గుర్తించాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి భాస్కరరావు, కూర్మినాయుడు తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో జై గురుదత్త హోమాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డిసాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురుదత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి తదితర పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అర్చనలు, అభిషేకములు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్ఎస్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీజైగురుదత్త హోమాలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హోమములో పాల్గొన్న దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.